క్లుప్తంగా

69వ వార్డులో అమర్‌నాథ్ ప్రచారం నేడు

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ జీవీఎంసీ 69వ వార్డులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే పాదయాత్ర రెడ్డి తుంగ్లాం రామాలయం నుంచి కాపుతుంగ్లాం, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్స్ మీదుగా చుక్కవానిపాలెం వరకు జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

సేవలకు గుర్తింపు



రామ అప్పారావును సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

అగనంపూడి: నిజమైన సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని వికలాంగుల సంస్థ నెట్‌వర్క్, నేషనల్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ఫర్ డిజేబుల్డ్ పీపుల్ (న్యూఢిల్లీ) జిల్లా కో–ఆర్డినేటర్ కావ్య పూర్ణిమ అన్నారు. దివ్యాంగులు, క్షతగాత్రులను స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆదుకుంటున్న సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావును నగరంలోని సీతారామ రాజు విజ్ఞాన కేంద్రం ఆవరణలో సంస్థ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా సహాయ కార్యదర్శి జీలకర్ర రమణ, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు శ్రీనివాసరావు, నిమ్మకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం: మద్యం మత్తులో కాలువ దాటుతున్న ఓ వ్యక్తి సిమెంట్ కాంక్రీట్ రాళ్లపై పడి మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లిలోని లారీ యార్డులో డ్రైవర్‌గా పని చేస్తున్న కసిరెడ్డి సంతోష్ (30) భార్య గౌరి, కుమార్తెతో కలిసి అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం, పెద్ద గొల్లలపాలెం గ్రామంలో నివసిస్తున్నారు. ఆదివారం రాత్రి కూర్మన్నపాలెం దరి దువ్వాడ బ్రిడ్జి వైపు వచ్చే రోడ్డు టర్నింగ్ వద్ద నడుచుకుంటూ వస్తున్న సంతోష్ కాలువ దాటుతుండగా అక్కడున్న సిమెంట్ కాంక్రీట్ రాళ్లపై పడి మృతి చెందాడు. సమీపంలోని ఓ చిరు వ్యాపారి గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దువ్వాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు సంతోష్ ఫోన్ నుంచి అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంతోష్ భార్య గౌరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్ మేజర్ సబ్జెక్టులపై శిక్షణ



అధ్యాపకులతో మాట్లాడుతున్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

దాబాగార్డెన్స్: కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్స్‌పై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ సింగిల్ మేజర్ సబ్జెక్టుల్లో భాగంగా హిస్టరీ, పొలిటికల్ సైన్స్‌కు సంబంధించి జిల్లాలోని అధ్యాపకులు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారని చెప్పారు. అధ్యాపకులు నూతన విద్యా విధానం, పరిశోధనలు వంటి వాటికి సంబంధించి నూతన పోకడలు తెలుసుకుని వినూత్నంగా విద్యను అందించాలని, విద్యార్థుల నైపుణ్యానికి కృషి చేయాలని కోరారు. ఎన్‌ఆర్‌సీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.ఎల్.శిరీష, రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ వై.రమేష్‌బాబు, జేకేసీ మెంటార్ డి.ప్రజ్ఞ, జిల్లాలోని అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రగతి పరవళ్లు

- కనివిని ఎరుగని రీతిలో 65వ వార్డు అభివృద్ధి
- దశాబ్దాల నాటి సమస్యలు.. ఐదేళ్లలో పరిష్కారం
- రూ.14.12 కోట్లతో చకచకా పనులు
- మౌలిక వసతుల కల్పనపై ప్రజల హర్షం



కొత్తగా నిర్మించిన కాకతీయ ఐటీఐ రోడ్డు

పెదగంట్యాడ: దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న 65వ వార్డు రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. గత ఐదేళ్లలో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.14 కోట్ల 12 లక్షల 7వేలతో అభివృద్ధి పనులు చేపట్టారు. కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, కాలువలు, సామాజిక భవనాలు, గెడ్డల ఆధునికీకరణ, ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ, ఈతకొలను నిర్మాణ పనులు చేపట్టారు. కొండవాలు ప్రాంతాలను అభివృద్ధి చేశారు. గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి ఈ ఐదేళ్లలో జరగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తగా నిర్మించిన కల్వర్టుపై వంతెన

రోడ్లకు మహర్దశ.. కల్వర్టుల నిర్మాణం

- రూ.1కోటి 98 లక్షల 35వేల రూపాయలతో బాపూజీ కాలనీ, గిరిజా కాలనీ, భానోజీతోట, వికాస్‌నగర్ గెడ్డలకు రక్షణ గోడలు నిర్మించడంతో పాటు కొత్తగా కల్వర్టులు నిర్మించారు.
- రూ.2కోట్ల 23లక్షలతో కాకతీయ ఆర్చి నుంచి ఐటీఐ వరకూ ప్రధాన రహదారి, కాలువలు నిర్మించారు.
- రూ.1.14లక్షలతో సంజీవిగిరి కాలనీ, బాపూజీ కాలనీలో మెట్ల మార్గం, రోడ్లు, కాలువలు నిర్మించారు.
- రూ.70లక్షల 93వేలతో బాపూజీ కాలనీ, నేతాజీ కాలనీలో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టారు.
- రూ.36 లక్షలతో వాంబే కాలనీలో రోడ్లు నిర్మించారు. అలాగే బ్లాకుల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, అక్కడ కూడా సిమెంట్‌తో నిర్మించారు.
- రూ.20 లక్షలతో సంజీవ కాలనీ, గిరిజా కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించారు.
- రూ.61లక్షల 39వేలతో వికాస్‌నగర్, కేఎల్ రావు నగర్‌లో రోడ్లు, కాలువలు నిర్మించారు.
- రూ.89లక్షల 6వేలతో అశోక్‌నగర్ అన్ని లైన్లకు రోడ్లు, కాలువలు నిర్మించారు.



బాపూజీ కాలనీలో సిమెంట్ రోడ్డు

రూ.6 కోట్లతో స్టేడియం ఆధునికీకరణ

వార్డు పరిధి వికాస్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనుల కోసం ప్రభుత్వం రూ.6 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో స్టేడియం ఫ్రంట్ ఎలివేషన్, వెనక ఈతకొలను, ప్రహరీ నిర్మించనున్నారు. స్టేడియం లోపల ఫ్లోరింగ్, మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి.



జోరుగా సాగుతున్న ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనులు



చాకలిగెడ్డకు ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడ

వసతులు కల్పించారు



గతంలో మా ప్రాంతం లోని రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉండేవి. కాలువలు ఛిద్రం కావడంతో మురుగునీరు రోడ్ల పైకి వచ్చేసిది. దీంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు ఆ సమస్యలు తీరాయి. ఈ ఐదేళ్ల కాలంలో మా ప్రాంతంలో రోడ్లు, కాలువలు నిర్మించారు. మా ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం సంతోషంగా ఉంది.

–కోలంటి దేవి, వాంబే కాలనీ

రూపురేఖలే మారిపోయాయి



నేను ఇక్కడే పుట్టి పెరిగాను. నా చిన్నప్పటి నుంచి చూస్తున్నాను. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో సమస్యలతో సతమతమయ్యేవాళ్లం. కానీ 2019 తర్వాత మా ప్రాంతం రూపురేఖలు మారిపోయాయి. రోడ్లు అభివృద్ధి చేశారు. కాలువలు నిర్మించారు. గెడ్డలకు రక్షణ గోడలు నిర్మించారు. కృతజ్ఞతలు.

– కర్రి అప్పలరాజు, బాపూజీ కాలనీ

దశాబ్దాల సమస్య తీరింది



కాకతీయ ఆర్చి ప్రాంతంలో 30ఏళ్లుగా నివాసం ఉంటున్నాను. కొండవాలు ప్రాంతాల్లో మెట్లు, రోడ్లు శిథిలం కావడంతో వర్షాలు పడితే బురదమయంగా మారేవి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఎక్కడ జారి పడిపోతామోనని భయపడేవాళ్లం. దశాబ్దాల నాటి సమస్యను పరిష్కరించారు. ఇప్పుడు ఎటువంటి భయం లేదు.

– కె.నాగేశ్వరి దేవి, కాకతీయ ఆర్చి

సమస్యలన్నీ పరిష్కరించారు



వారు పరిధిలోని ఏ ప్రాంతం చూసినా అభివృద్ధి కనిపిస్తోంది. రహదారులు, కాలువలను బాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల అవసరాలు గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇప్పుడు సమస్యలన్నీ పరిష్కారం అయ్యాయి.

– కదవల ఈశ్వరరావు, బాపూజీ కాలనీ

జగనన్న పాలనలో పేదలకు మేలు

- రాష్ట్ర భవిష్యత్తు కోసం వైఎస్సార్‌సీపీనే గెలిపించాలి
- ఆ పార్టీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్
- 74వ వార్డులో జోరుగా ప్రచారం



అమర్‌నాథ్‌కు హారతులు ఇస్తున్న మహిళలు



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కరపత్రాన్ని అందజేస్తున్న అమర్‌నాథ్

పెదగంట్యాడ: పేదలకు మంచి జరగాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పాలన కొనసాగాలన్నా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జీవీఎంసీ 74వ వార్డులో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. ముందుగా నెహ్రూనగర్‌లోని వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దయాల్‌నగర్ లోవ, టీబీసీ పాయింట్, గౌరీ సేవాసంఘం వీధి, క్వారీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గాజువాక నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేశామని గుర్తించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను నేరుగా అందించారన్నారు. సంక్షేమ పాలన కొనసాగింపునకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

పింఛన్ల పంపిణీపై చంద్రబాబు కుట్ర

ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే తలుపు తట్టి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు నేరుగా ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ చేయడంతో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఓర్వలేక పోయారని అమర్‌నాథ్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ విషయంలో ఈసీకి లేఖలు రాయించి అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. చంద్రబాబు నాయుడు చర్యతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు నిరాశ చెందుతున్నారన్నారు. కోర్టుకెళ్లి మరీ పింఛన్ల పంపిణీని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారన్నారు. ఇది టీడీపీ నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గం అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, నాయకులు జీలకర్ర నాగేంద్ర, ఎస్‌వై నాయుడు, దల్లి పైడికొండ, ఎస్.రాజారావు, లోకేష్, త్రినాథ్, బొడ్డు గోవింద్, ఒమ్మి ఈశ్వరి, గొరుసు రామలక్ష్మి, గొందేశి సత్తిరెడ్డి, దుర్గారెడ్డి, ప్రసాద్, వెంపాడ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

ఘనంగా గురుమూర్తిరెడ్డి జన్మదిన వేడుకలు



గురుమూర్తిరెడ్డికి కేక్ తినిపిస్తున్న రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డి తదితరులు

గాజువాక: పెందుర్తి మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు ఇక్కడి వికాస్‌నగర్‌లోని ఆయన నివాసానికి తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎంపీ, విశాఖ తూర్పు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, రాష్ట్ర మంత్రి, గాజువాక వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు గురుమూర్తిరెడ్డితో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, మళ్ల విజయప్రసాద్, తైనాల విజయ్‌కుమార్, మాజీ మేయర్లు రాజాన రమణి, పులుసు జనార్ధనరావు, వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనందకుమార్ వైఎస్సార్ సీపీ గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, రాజాన రామారావు, దల్లి గోవిందరెడ్డి, బట్టు సూర్యకుమారి, బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, గులివిందల లావణ్య, వీఆర్‌ఎండీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, నాయకులు దామా సుబ్బారావు, మంత్రి రాజశేఖర్, రొంగలి జగన్నాథం తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

'కేంద్ర ప్రభుత్వ తీరు అమానుషం'



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వ తీరు అమానుషమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పే సమయం ఆసన్నమైందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1145వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మికులు నిరంతరాయంగా దీక్షలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడం దురదృష్టకరమన్నారు. కార్మికుల ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



దేవన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసరాజును సత్కరిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అదనపు పరిశీలకునిగా నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన భూపతిరాజు శ్రీనివాసరాజును ఆ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ, గొందేశి వెంకటరమణారెడ్డి, రోజారాణి, పిట్టా రెడ్డి, రెడ్డి, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, ఎండీ గౌస్, అప్పలరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్, కనకరాజు, ఆనంద్, ఈశ్వరరావు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి'



స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోబ్తీతో చర్చిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు నేతృత్వంలో నాయకులు సోమవారం స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోబ్తీని కలిసి జీతాలపై చర్చించారు. కష్టపడి పనిచేసే కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం యాజమాన్యం వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఉద్యోగులకు క్యాంటీన్ సదుపాయం నిలిపి వేయడం దుర్మార్గమన్నారు. దీనిపై సోబ్తీ మాట్లాడుతూ సాయంత్రానికల్లా క్యాంటీన్ సమస్య పరిష్కరిస్తామని నాయకులు చెప్పారు. జీతాల అంశంపై స్పష్టమైన హామీ ఇవ్వకుండా దాటవేయడంపై నాయకులు అభ్యంతరం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.ఎ.నాయుడు, కొమ్ము ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్లు తెరిపించాలి

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాంటీన్లు మూసి వేయడం అన్యాయమని స్టీల్ సీఐటీయూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తెరిపించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) సోబ్తీని నాయకులు సోమవారం కలిసి క్యాంటీన్ల అంశంపై చర్చించారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి తక్షణం క్యాంటీన్ తెరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించపోతే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా న్యాయవాదుల సంఘం ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న న్యాయవాదులు

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికలకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ప్రధాన అభ్యర్థులందరూ పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి కోర్టు ఆవరణ బయట తమ పరిధిలో ప్రచారాన్ని కొనసాగించారు. కీలకమైన అన్ని పోస్టులకు గట్టి పోటీ ఉండటంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రతి న్యాయవాదిని వ్యక్తిగతంగా కలిసి తమకు ఓటు వేయవలసిందిగా అభ్యర్థించారు. ప్రచారం బుధవారం సాయంత్రంతో ముగుస్తుంది. ఈ నెల 4వ తేదీ గురువారం ఎన్నికలు జరుగుతాయి.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.


ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

మహారాణిపేట: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి అనుమతులు తీసుకోవాలని తూర్పు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. సమావేశాలు, ఇంటింటి ప్రచారం, ర్యాలీలు, తాత్కాలిక పార్టీ ఆఫీసుల నిర్వహణకు రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని, లేకపోతే ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియమ, నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణకు సహకరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కగా అమలు చేయడానికి వివిధ విభాగాలు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 4, ఎంసీసీ బృందాలు 3 కేసులు నమోదు చేశాయన్నారు. పార్టీలు పెడుతున్న ఎన్నికల ఖర్చుల పరిశీలనకు ఒక అధికారి పని చేస్తున్నారన్నారు.

నగరంలో ముమ్మర తనిఖీలు

తాటిచెట్లపాలెం: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో తనిఖీలు ముమ్మరం చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.శ్రీనివాసరావు ఆదేశాలతో సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సెబ్ సిబ్బంది రాజుల నాయుడు, ముసలనాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉద్యోగావకాశాలు



పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్యను అభ్యసించిన వారికి విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. కాలేజీలో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. పాలిటెక్నిక్ పూర్తి కాగానే కనీస రూ.3.50 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు వస్తాయన్నారు. వీరు ఈసెట్ రాసి నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరం కోర్సులో చేరవచ్చని వివరించారు. విద్యార్థులు శిక్షణ తరగతులకు ప్రతి రోజు హాజరై మంచి ర్యాంకులు సాధించాలని ఆయన సూచించారు. శిక్షణ తరగతులకు 165 మంది హాజరయ్యారు. వీరిలో 72 మంది బాలికలు ఉన్నారు. మొత్తం విద్యార్థులను రెండు బ్యాచీలుగా విభజించి కోచింగ్ ఇస్తున్నట్లు శిక్షణ తరగతులు పర్యవేక్షకుడు, జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ పీఎం బాషా చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.